జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజలకోసం

## కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

బుధవారం | 25 | ఫిబ్రవరి | 2026 | పేజీలు: 11

## ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర ప్రభుత్వ విప్



వేములవాడ, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేములవాడ మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విప్ ఆది శ్రీనివాస్‌ను అభినందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై ఆశీర్వాదం అందించారని విప్ పేర్కొన్నారు. అదేవిధంగా, వేములవాడ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విప్ ముఖ్యమంత్రిని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

# ఇంటర్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి

- సీఎస్ కె.రామ కృష్ణ రావు
- ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణ
- పరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి
- ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలి
- పరీక్షా సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి
- ఇంటర్ పరీక్షల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎస్





ఇంటర్ పరీక్షలను రాష్ట్రంలో కట్టుదిట్టంగా నిర్వహించాలని సి.ఎస్.కే రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఎస్ కె.రామ కృష్ణ రావు ఇంటర్ పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

2



## ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ఆడబిడ్డల కళ్యాణంతో తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

2



## ఇందిరమ్మ ఇళ్లతో కొత్త వెలుగులు

మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

2

## హెల్మెట్ ధరించిన వారికి పుష్పాలు

లేనివారికి హెల్మెట్ పంపిణీ

ప్రాణ భద్రత కోసం హెల్మెట్ తప్పనిసరి

సీపీ అంబర్ కిషోర్ ఝా



3



## ఇందిరమ్మ ఇళ్లతో కొత్త వెలుగులు

### మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**తిమ్మాపూర్ ఫిబ్రవరి 24 ( ప్రజాజ్యోతి ) :**

ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలతో పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు తొంగిచూస్తాయని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో జరిగిన తమ్మనవేణి మల్లమ్మ, పుట్ట స్వరూప, పుల్లీ బేగం ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎంతో కాలంగా నిరుపేదలు సొంతింటి కల కోసం ఎదురు చూస్తున్నారని, ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం వారి కలను సాకారం చేస్తున్నదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో నిరుపేదల ఆత్మగౌరవాన్ని ప్రభుత్వం పెంచిందన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తొలి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తికావస్తున్నాయని, పూర్తయిన ఇళ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగం పెంచుతున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత నవాబ్ ఇబ్రహీం షేక్, తిమ్మాపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి మల్హోత్రా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, పార్టీ నాయకులు మోరపల్లి రమణారెడ్డి, గోగూరి నర్సింహారెడ్డి, సిరిగినేని కొండల్ రావు, బుధారపు శ్రీనివాస్, కొత్త తిరుపతిరెడ్డి, వార్డు మెంబర్లు నూనె సురేష్, దాడి మొండయ్య, టి.స్వరూప, ఆవుల నర్సయ్య, నిసర్, తాజొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# నిత్య అన్నదానసత్రం నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం

### ప్రకటించిన మంత్రి కొండా సురేఖ.



**వేములవాడ ఫిబ్రవరి, 24: ప్రజాజ్యోతి.**

వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రులు హైదరాబాద్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి మొత్తం నాలుగు దశల్లో రూ.695 కోట్ల వ్యయంతో మాస్టర్ ప్లాన్ రూపొందించగా, అందులో తొలి దశకు సంబంధించిన రూ.111.25 కోట్ల పనుల పురోగతిపై సమీక్షించారు. తొలి దశ పనులు 2027 మార్చి 31లోపు పూర్తి చేయాలని, ఈ ఏడాది వర్షాకాలం రాకముందే రూఫ్ లెవల్ పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను మంత్రి ఆదేశించారు. వేములవాడ దేవాలయంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భక్తుల సౌకర్యాల మెరుగుదల, మౌలిక సదుపాయాల విస్తరణపై విస్తృతంగా చర్చించారు. పనులు వేగవంతం చేసి, రాజన్న సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. శృంగేరి పీఠాధిపతి సూచనల మేరకు ఆలయ అభివృద్ధి పనులు మ-ుమ్మరంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఒకేసారి 500 మంది కూర్చునేలా నిత్య కళ్యాణ మండపం నిర్మాణ పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. మహా మండపం నిర్మాణంలో రాఫ్ట్ పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయని వివరించారు. నిత్య అన్నదాన సత్రం నిర్మాణాన్ని అన్ని వసతులతో చేపట్టాలని ఆదేశించారుదాతల సహకారంతో అన్నదాన సత్రానికి రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటుచేయాలనినిర్ణయించారు. అందులో భాగంగా మొదటి విరాళంగా మంత్రి కొండా సురేఖ 25 లక్షల రూపాయలు ఇస్తామని ప్రకటించారు..విప్ ఆది శ్రీనివాస్ కొండా సురేఖ కు కృతజ్ఞతలు తెలిపారు. ుచెరువు కట్టపై జరుగుతున్న ట్యాంక్ బండ్ పనుల పురోగతిపై మంత్రి కొండా సురేఖ వివరాలు తెలుసుకున్నారు.చిన్నపిల్లలతో వచ్చే తల్లులకోసం ఫీడింగ్సెంటర్ఏర్పాటుచేయాలని సూచించారు. భక్తుల కోసం తగిన టాయిలెట్లు నిర్మించాలని సూచించారు. రాజన్న ఆలయంలో కోడెల సంరక్షణకు ప్రత్యేక వెటర్నరీ డాక్టర్‌ను నియమించడంతో పాటు, భక్తుల కోసం పూర్తి స్థాయిలో వైద్యులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. దేవాలయంలో వాడిన పూలతో అగ రబత్తీలు తయారు చేసి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీశైలం దేవస్థానం తరహాలో శివ స్తోత్రాలతో మ్యూజిక్ ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హరీష్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, దేవాదాయశాఖ సలహాదారు గోవింద హరి, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### భర్త ఎల్ఎల్బి.. భార్య బి.కామ్

# వృత్తి రాజన్న సన్నిధిలో భిక్షాటన

**వేములవాడ, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

వేములవాడ రాజన్న సన్నిధిలో కదిలించే గాథ...

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పుణ్యక్షేత్రం వేములవాడ. ఆపదలో ఉన్నవారిని ఆదుకునే ఆ రాజరాజేశ్వరుని సన్నిధిలో ఇప్పుడు ఒక దీన గాథ... అందరినీ కదిలించి వేస్తోంది. కాన్వెంట్ చదువులు, ఉన్నత డిగ్రీలు ఉన్నా.. కాలం చేసిన గాయానికి ఆ దంపతులు నేడు యాచకులుగా మారారు.లి

అనర్గళంగా ఇంగ్లీష్ మాట్లాడుతూంటే.. ఆశ్చర్యపోయిన అధికారులు!లి

వేములవాడ ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తున్న వారికి పోలీసులు, అధికారులు కలిసి ఇటీవల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆ గుంపులో ఉన్న ఒక జంటను పలకరించిన అధికారులకు నోట మాట రాలేదు.వారు మాట్లాడుతున్న అనర్గళమైన ఇంగ్లీష్, వారి ఆహార్యం చూసి అవాక్కయ్యారు.

భర్త జలంధర్ రెడ్డి: లా (ఎల్ఎల్బి) పూర్తి చేసిన విద్యావంతుడు.

భార్య శిరీష: బీకాం కంప్యూటర్స్ చదివిన పట్టభద్రురాలు.

కరీంనగర్‌కు చెందిన ఈ దంపతులు ఇక్కడికి ఎందుకు వచ్చారో తెలిస్తే ఎవరికైనా గుండె తరుక్కుపోతుంది. భార్య ఆరోగ్యం క్షీణించడంతో, ఆమెకు తోడుగా ఉంటూ.. రాజన్నే దిక్కని నమ్మి ఇక్కడికి వచ్చారు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ, ఆ దేవుడి ప్రసాదంతోనే కడుపు నింపుకుంటున్నారు. నేటి కాలంలో చిన్న కారణాలకే విడిపోతున్న జంటల మధ్య.. భార్య కోసం సర్వం వదులుకుని అండగా నిలిచిన ఆ భర్త ప్రేమ చూసి అధికారులు సైతం భావోద్వేగానికి లోనయ్యారు.లి



ఆస్తులున్నా.. ఆదరణ కరువైన వృద్ధులు కేవలం ఈ దంపతులే కాదు..అక్కడ సుమారు 100 మందికి పైగా యాచకులు ఉన్నారు. వారిలో అత్యధికులు వృద్ధులే. వారి గాథలు వింటే సమాజం ఎటు వెళ్తుందో అర్థం కావట్లేదు...

కన్నపిల్లల వేధింపులు: కొందరు కొడుకులు, కోడళ్లు పెడుతున్న హింస భరించలేక ఇక్కడికి చేరారు.

భయం నీడలో: ఇంటికి వెళ్తే పిల్లలు కొట్టి చంపుతారేమో అన్న భయంతో రాజన్నను ఆశ్రయించారు.

దిక్కులేని స్థితి: "ఆస్తులు ఉన్నాయి, అంతస్తులు ఉన్నాయి.. కానీ మమ్మల్ని ప్రేమించే మనసున్న మనుషులు లేరు. అందుకే మా రాజన్నే మమ్మల్ని సాదుతున్నాడు" అంటూ ఆ వృద్ధులు బోరున విలపించడం అక్కడి వాతావరణాన్ని విషాదంలోకి నెట్టింది.లి

అధికారుల భరోసా: "వేధించే వారిపై కఠిన చర్యలు"

ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ.. ఆలయ పరిసరాల్లో భిక్షాటన నిషేధమని, అయితే సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వృద్ధులను ఆదరించకుండా వీధుల్లోకి నెట్టే పిల్లలపై, వారిని వేధించే బంధువులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. కౌన్సిలింగ్ ద్వారా వారిని తిరిగి తమ ఇళ్లకు పంపేలా ప్రయత్నిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదివిన జలంధర్ రెడ్డి, శిరీషల కథ మన విద్యావ్యవస్థకు, సమాజానికి ఒక హెచ్చరిక. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం మనిషిని ఎంతటి స్థితికైనా దిగజార్చగలవని, కానీ ఆ కష్టాల్లోనూ వీడని వారి బంధం ఒక గొప్ప పాఠమని ఈ ఘటన నిరూపిస్తోంది.

# రానున్న రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు

**బిజెపి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి**

సుల్తానాబాద్ , ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :



అవినీతి, అక్రమాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రశ్నిస్తే అక్రమ కేసులు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని కర్రే సంజీవరెడ్డి ప్రశ్నించారు. మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీఏ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను బయటపెట్టిన వెంకటరమణారెడ్డిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. కామారెడ్డిలో షబ్బీర్ అలీ అనేక అక్రమాలకు పాల్పడ్డారని న్యాయబద్ధంగా వెల్లడించినందుకే ప్రతీకార చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రశ్నించేందుకు వెళ్తున్న రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును అడ్డుకుని గృహ నిర్బంధం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. పోలీసులు సైతం అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవహారాలన్నింటినీ నమోదు చేసుకుంటున్నామని తెలిపారు. గతంలో తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాలన కంటే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధ్వాన్నంగా వ్యవహరిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నారని, ప్రజలు క్రమంగా బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారని తెలిపారు. 2029 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు ప్రజా వ్యతిరేక విధానాలకు తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సింది పోయి కాంగ్రెస్ ప్రభుత్వం రౌడీయిజానికి పాల్పడిందని ఆరోపించారు. ధర్మపురి అరవింద్ ఎన్నికల ప్రాంతాల్లో అధికారులతో వాగ్వాదానికి దిగిన ఘటన దానికి నిదర్శనమని తెలిపారు. దేశవ్యాప్తంగా బీజేపీ పాలనకు ప్రజల మద్దతు పెరుగుతోందని, తెలంగాణలోనూ బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమని జోష్యం చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సొదరి మహేందర్ యాదవ్, పార్టీ నాయకులు మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, మెండే శంకరయ్య, ఎల్లంకి రాజు, కొల్లూరి సంతోష్, కొమ్మిడి రాజేందర్ రెడ్డి, మల్కా భాగ్యలక్ష్మి, ఎర్రం సంతోష్ రెడ్డి, మహేష్ పటేల్, వలస సాయి తదితరులు పాల్గొన్నారు.

# నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గజ్జల లక్ష్మణ్**

చొప్పదండి , ఫిబ్రవరి 24 ( ప్రజా జ్యోతి):



నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రజక కులస్తులపైన దాడి చేసి పసి పాప మృతికి కారణమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రజక కుటుంబం స్వామివారి దర్శనం కోసం టికెట్టు లేకుండా గుడిలోకి ప్రవేశించారని, గ్రామ సర్పంచ్ తో పాటుగా రెడ్డి అగ్రకుల అహంకారులు రజకులను దుర్భాషలాడుతూ విచక్షణ రహితంగా దాడి చేసి సభ్య సమాజం తల దించుకునేలా రెండు నెలల పసి పాపను నిర్దాక్షిణంగా తన్ని చంపడం దారుణం అన్నారు. ఇంతటి దారుణ హత్య చేసిన నిందుతులను పోలీసులు అరెస్ట్ చేయక పోవడం సిగ్గుచేటన్నారు .మూడు నెలల క్రితం కోదాడలో కర్ల రాజేష్ అనే మాదిగ యువకుడిని విచారణ పేరుతో లాకఫ్ డెత్ హత్య చేసిన రెడ్డి కులానికి చెందిన ఎస్ ఐ ని ఇప్పటివరకు సస్పెండ్ లేదని, పైగా అక్కడి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి వారి సామాజిక వర్గానికి చెందిన ఎస్ ఐ ని కాపాడడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నేను కిందినుండి వచ్చాను నాకు అన్ని తెలుసు అని చెప్పే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ విషయాలు మాత్రం తెలియడం లేదని విమర్శించారు. దళితులు, బలహీన వర్గాల పైన నిత్యం దాడులు జరుగుతున్నాయని, ఈ రాష్ట్రంలో ఎస్సి ఎస్టి బి సి మైనారిటీ వర్గాలకు రక్షణ లేకుండా పోయిందని ,ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి నిందితులపైన కేసులు నమోదు చేయించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# హెల్మెట్ ధరించిన వారికి పుష్పాలు

**లేనివారికి హెల్మెట్ పంపిణీ**

**ప్రాణ భద్రత కోసం హెల్మెట్ తప్పనిసరి**

**సీపీ అంబర్ కిషోర్ ఝా**

పెద్దపల్లి ప్రతినిధి , ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :







రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల చివరి వారం నిర్వహిస్తున్న “అరైవ్--అలైవ్” రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని మున్సిపల్ టీ జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ వినియోగం అత్యంత కీలకమని తెలిపారు. హెల్మెట్ ధరించి వచ్చిన ద్విచక్ర వాహనదారులకు పుష్పాలు అందించి అభినందించగా, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి హెల్మెట్లు పంపిణీ చేసి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే ట్రాఫిక్ చలాన్ విధించాల్సి వస్తుందని పేర్కొన్న ఆయన, చలాన్ విధించడం పోలీసుల లక్ష్యం కాదని, ప్రజల ప్రాణ రక్షణే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని, ప్రతి ఒక్కరూ ఇంటి నుంచి బయలుదేరిన ప్రతిసారి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. హెల్మెట్‌ను సరిగా ధరించి సేఫ్టీ లాక్ బిగించడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, అనిల్‌కుమార్, సత్యనారాయణ, ఎస్సైలు రమేష్ రాముని, హరిశేఖర్ తదితర పోలీసులు పాల్గొన్నారు.



## కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఏపీ మంత్రి సుభాష్ దిష్టిబొమ్మ దగ్ధం

**బిఆర్ఎస్ నాయకులు కంచర్ల రవి గౌడ్...**

సిరిసిల్ల టౌన్ , ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :

ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలంగాణ జాతిపిత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుల కంచర రవి గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద మంగళవారం మంత్రి సుభాష్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించి, పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మహానేతపై విమర్శలు చేయడం తగదని పేర్కొన్నారు. తెలంగాణను ద్రోహించిన పార్టీలకు ప్రజలు ఇప్పటికే తగిన తీర్పు ఇచ్చారని, రాష్ట్ర గౌరవాన్ని అవమానించే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. కేసీఆర్ గురించి మాట్లాడే ముందు తన రాజకీయ స్థాయి తెలుసుకోవాలని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని మంత్రి సుభాష్‌ను డిమాండ్ చేశారు. లేకపోతే తెలంగాణ ఉద్యమకారుల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేస్తూ, రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రతి ప్రయత్నానికి తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్, ఆరెల్లి వినయ్ కుమార్, రాకేష్ నాయక్, సాయికుమార్, అభిరామ్, మహేష్, ఎండి అజ్జు, నరేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## మహిళా న్యాయవాదిపై దాడికి నిరసనగా వేములవాడ న్యాయవాదుల విధుల బహిష్కరణ

**అధ్యక్షులు గుడిసె సదానందం.**



వేములవాడ , ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :

నిజామాబాద్ జిల్లా, బోధన్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న జి. కళ్యాణి పై దుండగులు ఫిబ్రవరి 22న దాడి చేయడాన్ని నిరసిస్తూ, మంగళవారం రోజున వేములవాడ న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గుడిసె సదానందం ఆధ్వర్యంలో.. న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి, ప్రధాన ద్వారం ముందు నినాదాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ... మహిళా న్యాయవాదిపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ నేరెళ్ల తిరుమల్ గౌడ్, పిట్టల మనోహర్, కట్కం జనార్దన్, పెంటరాజు, కొడిమ్యాల పురుషోత్తం, జెట్టి శేఖర్, మహిళా న్యాయవాదులు జక్కుల పద్మ, స్రవంతి, అపర్ణ, నాయిమా నాసారి న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

**కౌన్సిలర్ బాకం సాయికిరణ్**

సుల్తానాబాద్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :



మున్సిపాలిటీ 6వ వార్డులోని సుభాష్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి సమగ్ర చర్యలు తీసుకుంటానని 6వ వార్డు కౌన్సిలర్ బాకం సాయికిరణ్ తెలిపారు. మంగళవారం ఆయన పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల మరమ్మతులు వంటి సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయితేనే సమాజం అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు కౌన్సిలర్ బాకం సాయికిరణ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులతో ముచ్చటించిన ఆయన వారి అభిప్రాయాలు తెలుసుకుని, వారికి అరటిపండ్లు మరియు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు న్యాతరి దేవేందర్ కుమార్, ఆరేపల్లి సోహన్ రాజ్, ఆరేపల్లి కిరణ్, కొంద్ర ప్రణయ్, మామిడిపెల్లి శ్రీకాంత్, ఆరేపల్లి హేమన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారంతోనే యాదవుల సమస్యలకు పరిష్కారం

**యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి బైకని రవీందర్ యాదవ్**

ఎండపల్లి, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :





రాజ్యాధికారంతోనే యాదవ సామాజిక వర్గ బీసీ కులాల సమస్యలు పరిష్కారం అవుతాయని,రాజ్యాధికారం దిశగా యాదవులు,బీసీలంతా పయనించాలని ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి బైకని రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. రాజ్యాధికారంలో భాగస్వామ్యం లేకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదని వెల్లడించారు. ఈనెల 28న హైదరాబాద్‌లోనీ తెలుగు విశ్వ విద్యాలయంలో జరిగే జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ అధ్యక్షతన నిర్వహించనున్న దక్షిణ భారత యాదవ ప్లీనరీని యాదవులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణలో సుమారు 18 శాతం జనాభా కలిగిన యాదవులకు జనాభా దామాషా ప్రకారం గా మంత్రి పదవి ఇవ్వాలని, చట్టసభల్లో యాదవులకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

# రంగసాగర్ గడ్డపై అంగరంగ వైభవంగా వెన్నముద్దల గండి మల్లన్న జాతర

**ముగిసిన మూడు రోజుల వేడుకలు**
**- భారీగా తరలివచ్చిన భక్తులు**
**భక్తుల పాలిట కొంగు బంగారు 'మల్లన్న' - సర్పంచ్ బోడ సాగర్:**





బీర్ పూర్, ఫిబ్రవరి 24(ప్రజా జ్యోతి):

రంగసాగర్ గ్రామ పంచాయితీ పరిధిలోని వెన్నముద్దల గండి వద్ద వెలసిన స్వయంభూ శ్రీ మల్లిఖార్జున స్వామి, గొల్లకేతమ్మ అమ్మవార్ల జాతర వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా ముగిశాయి. యాదవ సంఘం ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా (ఫిబ్రవరి 22 నుండి 24 వరకు) జరిగిన ఈ ఉత్సవాల్లో భక్తులు వేల సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. జాతర చివరి రోజైన మంగళవారం ఉదయం నుండే భక్తుల తాకిడి పెరిగింది. ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన అగ్నిగుండాలు, మల్లన్న పట్నాలు మరియు ఎల్లమ్మ బోనాల కార్యక్రమాలు భక్తి పారవశ్యాన్ని నింపాయి. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో వెన్నముద్దల గండి పరిసర ప్రాంతాలు మారుమోగిపోయాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రంగసాగర్ గ్రామ సర్పంచ్ బోడ సాగర్ మాట్లాడుతూ.. తరతరాలుగా భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారంగా వెన్నముద్దల గండి మల్లిఖార్జున స్వామి ప్రసిద్ధి చెందారని కొనియాడారు. గతంలో తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలోనే కాకుండా, ప్రజలు రెండోసారి ఆశీర్వదించి గెలిపించిన తర్వాత స్వామివారి సేవలో పాల్గొనడం తన అదృష్టమని పేర్కొన్నారు. గ్రామాలన్నీ పాడి పంటలతో వర్ధిల్లాలని, ప్రజలకు ఎటువంటి రోగాలు ప్రబలకుండా స్వామివారు, అమ్మవారు చల్లగా కాపాడాలని ఆయన కోరుకున్నారు. జాతరకు విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించడంలో సహకరించిన యాదవ సంఘం సభ్యులకు, గ్రామ పెద్దలకు, అధికార యంత్రాంగానికి, పోలీసు శాఖకు మరియు పత్రికా మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఈ జాతరను మరింత ఘనంగా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చేలా నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంఘ గంగన్న, వార్డు సభ్యులు, యాదవ సంఘం ప్రతినిధులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు

మెట్‌పల్లి, ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి):

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని సోమవారం సాయంత్రం మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ ఛైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ ఎన్నికల్లో మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ గా మైలారపు లింబాద్రి, వైస్ ఛైర్మన్ గా ఓంకారి నవీన్ కుమార్ గెలుపొందగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావులతో కలిసి మర్యాదపూర్వకంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ ఛైర్మన్ ఓంకారి నవీన్ కుమార్లు గెలుపొందిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మెట్ పల్లి మున్సిపల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన ప్రణాళిక అంశాలను సీఎం రేవంత్ రెడ్డితో ఈ సందర్భంగా వారు చర్చించారు. మెట్ పల్లిని ఆదర్శవంతమైన మున్సిపల్ గా తీర్చిదిద్దడానికి ముందుండి పనిచేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లికి చెందిన పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కరెంట్ అసిస్టెంట్ హెల్పర్‌ను నియమించాలని సెస్ ఏఈకి వినతిపత్రం

కోనరావుపేట, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :

కోనరావుపేట మండలం భూక్యా రెడ్డి తండా,కమ్మరిపేట తండా, అజ్మీరా తండా గ్రామాలకు అస్టెంట్ హెల్పర్ ను నియమించాలని సర్పంచ్ బానోత్ నరేష్ నాయక్, జయరాం లు సెస్ ఏఈ దివ్య , కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరేష్ నాయక్ మాట్లాడుతూ రాబోయే వేసవికాలంలో తరచూ కరెంట్ సమస్యలు ఓవర్ లోడ్ వల్ల వస్తాయని అన్నారు.గతంలో నియమించిన 5 గ్రామాలకు ఒక్క కరెంట్ హెల్పర్ ఉన్న ఒక్కడి వల్ల పనులు కావడం లేదని 3గ్రామాలకు ప్రత్యేక అసిస్టెంట్ హెల్పర్ ను నియమించాలని అధికారులకు వినతి పత్రం ఇచ్చారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ రద్దు

**నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఓరుగంటి ఆనంద్ ప్రతిపాదన**

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి)



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కరీంనగర్ ఫిలిం భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రస్తుత రాష్ట్ర కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఓరుగంటి ఆనంద్‌ను ప్రతిపాదించి అధికారికంగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు ఓరుగంటి ఆనంద్ హాజరయ్యారు. ప్రతి జిల్లా నుంచి ఉద్యమకారుల ఫోరం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓరుగంటి ఆనంద్ మాట్లాడుతూ, గడిచిన ఎనిమిది సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో అనేక పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఉద్యమకారుల హక్కుల అంశాన్ని మేనిఫెస్టోలో చేర్చాలని మంత్రి శ్రీధర్ బాబు ను స్వయంగా కలిసినట్లు పేర్కొన్నారు. అలాగే హరిహర కళాభవన్‌లో నిర్వహించిన ఆత్మగౌరవ సభకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కావడానికి కృషి చేశామని తెలిపారు.కరీంనగర్‌లో మహా చండీయాగం, వేములవాడ మహా పాదయాత్ర, రిలే నిరాహార దీక్షలు, పాదయాత్రలు వంటి పలు కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమకారుల హక్కుల సాధన కోసం మరింత ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.ఈ సందర్భంగా నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఓరుగంటి ఆనంద్‌కు జిల్లాల ఉద్యమకారులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మహిళా నాయకురాలు కాయతీ జానకి రెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కనకం కుమారస్వామి, మొత్తం యాదిరెడ్డి, భాష, బోయిన రవీందర్, తాడూరు గగన్ కుమార్, ఉప్పు రవీందర్, కలర్ సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైపరీత్యంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ఎకరానికి 20 వేలు నష్టపరిహారం అందించాలి**
**బడ్జెట్ సమావేశంలో పంట నష్టం, రైతు భరోసాపై నిర్ణయం తీసుకోవాలి**
**ఫిబ్రవరి చివర్లో రైతు భరోసా అందించాలి**
**మాజీ మంత్రి జీవన్ రెడ్డి**





**రాయికల్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

ఆరుకాలం కష్టపడి పండించిన పంట కోతకు వచ్చే దశలో పకృతి వైపరీత్యంతో అకాల వర్షం,ఈదురు కాలులతో పంట నష్టపోయిన మొక్కజొన్న,మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు.సోమవారం రాత్రి ఈదురు గాలులు, అకాల వర్షంతో నేలకొరిగిన మొక్కజొన్న, మామిడి పంటలను రాయికల్ మండలంలోని రామజిపేట్ గ్రామంలో మంగళవారం క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పరిశీలించారు.కలెక్టర్,వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు. అనంతరం రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాజీ మంత్రి మాట్లాడుతూ పంట నష్ట భీమ పథకం అమలు లేనందున పకృతి వైపరీత్యంతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 20 వేలు నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలు రాజకీయ అంశం మాత్రమేనని తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి మేలు కలిగే రైతు భరోసా నిధులు ఈనెల ఫిబ్రవరి చివర్లో విడుదల చేసి రైతులకు అండగా నిలవాలని సూచించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు బిడ్డ కాబట్టి రైతుల పక్షాణ దృష్టి సాధించి దేశానికి అన్నం పెట్టే రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,నాయకులు తంగేళ్ల రమేష్,ఎద్దండి భూమారెడ్డి,కొయ్యడి మహిపాల్,దాసరి గంగాధర్,కడకుంట్ల నరేష్,మున్ను,ఎద్దండి లింగారెడ్డి,బాపురపు నర్సయ్య,కొమ్ముల ఆదిరెడ్డి, బత్తిని భూమయ్య,షాకీర్,మంద రమేష్, నాగరాజు,రాజీవ్,శివ,రాజారెడ్డి,హరీష్ రావు,సుధీర్ రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# నానో యూరియాతో అధిక దిగుబడులు

**రైతువేదికలో వ్యవసాయ శాఖ అవగాహన**

**బుగ్గారం, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి):**

మండలంలోని బుగ్గారం రైతువేదికలో మంగళవారం రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంటల ఉత్పాదకత పెంపు, ప్రకృతి వ్యవసాయం, కిచెన్ గార్డెన్‌పై నిపుణులు వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిణి అక్షిత మాట్లాడుతూ నానో యూరియా వినియోగం ద్వారా తక్కువ పరిమాణంలోనే పంటలకు అవసరమైన నత్రజని అందుతుందని తెలిపారు. ఆకులపై పిచికారి చేయడం ద్వారా ఎరువు సమర్థవంతంగా పనిచేసి అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా వాడకం ఖర్చు తగ్గించడమే కాకుండా నేల ఆరోగ్యాన్ని కాపాడుతుందని వివరించారు. రైతులు సిఫార్సు చేసిన మోతాదులోనే పిచికారి చేయాలని సూచించారు. ఉద్యాన విస్తరణ అధికారి వంశీ మాట్లాడుతూ మహిళా రైతులకు అనుకూలంగా కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా కుటుంబ పోషణలో పోషకాహారం పొందవచ్చని తెలిపారు. ఇంటి పరిసరాల్లో తక్కువ స్థలంలోనే కూరగాయల సాగు చేసే విధానాలు, సీజనల్ కూరగాయల ఎంపిక, తక్కువ ఖర్చుతో సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖలో అమలులో ఉన్న వివిధ పథకాల ద్వారా




నాట్ల పంపిణీ, డ్రిప్ సదుపాయం, సబ్సిడీ వివరాలను వివరించారు. ఏఈఓ నవీద్ ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వివరిస్తూ జీవామృతం, గోమయం వంటి సహజ వనరులతో సాగు చేస్తే నేల సారవంతత పెరిగి దీర్ఘకాలంలో అధిక లాభాలు పొందవచ్చని చెప్పారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తూ ఖర్చులు నియంత్రించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సీఆర్‌పీలు రమ్య, స్వరూప రైతులకు పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో రైతులు, మహిళా రైతులు పాల్గొని నిపుణులను ప్రశ్నించారు. వ్యవసాయ సాంకేతిక పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**- మున్సిపల్ ఛైర్మన్ మైలారపు లింబాద్రి**
**- మెట్ పల్లిలో యువతకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత**

**మెట్ పల్లి, ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి ):**



ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వ ర్యంలో అందిస్తున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ అన్నారు. మెట్ పల్లి ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 22న మెట్ పల్లిలో చేపట్టిన ఓపెన్ ఉద్యోగ మేళకు హాజరై ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించిన పలువురు యువతకు మంగళవారం నియామక పత్రాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యువతకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత ఆధునిక యుగంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడానికి మెట్ పల్లి ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ యాసీన్, ఎండీ బిస్మిల్లా ముందుకు రావడం అభినందనీయం అన్నారు. భవిష్యత్తులో మరింత మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. కాగా ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ గా మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ గా ఓంకారి నవీన్ కుమార్ లు విజయం సాధించగా మెట్ పల్లి ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ యాసీన్, ఎండీ బిస్మిల్లా ఘనంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనకు కృషి చేస్తున్న సందర్భంగా యాసిన్, బిస్మిల్లాలను మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఐక్యూ మైండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు ఎండీ యాసీన్, ఎండీ బిస్మిల్లా, అధ్యాపకులు పులిమామిడి ప్రవీణ్ కుమార్ (ఎంఏ ఇంగ్లీష్), నాయకులు మైలారపు రాంబాబు, కోట కిరణ్ కుమార్ (ప్రముఖ సామాజిక సేవకులు), సిబ్బంది డీ. మనోహర్, బీ. రాజేందర్, బీ. అఖిల, ఎం వేణు, బీ. మాధవి, పలువురు యువత పాల్గొన్నారు.

# సిరిసిల్ల నుంచి హైదరాబాద్ ఎక్స్ ప్రెస్ బస్సును నడపండి

**రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ కు విజ్ఞప్తి...**

**ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**



ఎల్లారెడ్డిపేట మండలం లోని రాచర్ల గొల్లపల్లి సర్పంచి కొండ రమేష్ గౌడ్ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలసి సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట గొల్లపల్లి మీదుగా కామారెడ్డికి ఎక్స్ప్రెస్ బస్సులు ఉదయం పూట నడపాలని విజ్ఞప్తి చేశారు .ఇక్కడి ప్రయాణికులు ఉదయం పూట హైదరాబాదులోని సాఫ్ట్వేర్ ఉద్యోగాలు, ఇంజనీరింగ్ కాలేజీలో చదివే విద్యార్థులు ఉదయం పూట వెళ్ళుటకు ఇబ్బందిగా ఉందని ఆయన దృష్టికి తీసుకువెళ్లగా మంత్రిగా దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రిగారు సానుకూలంగా స్పందిస్తూ అధికారులను రూటు సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఇక్కడ ప్రాంత వాసులు ఈ వార్తలు విన్న సంతోషాన్ని వ్యక్తం చేశారు .తొందరలోనే బస్సు నడపాలని విజ్ఞప్తి చేశారు.



**'ప్రజాజ్యోతి' ఎఫెక్ట్...**

# ప్రమాదకర బావిని పూడ్చివేసిన అధికారులు

**కొడిమ్యాల, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి):**

మండలంలోని డబ్బు తిమ్మయపల్లి గ్రామంలో 'ప్రమాదం పొంచి ఉన్న పట్టించుకోరా..?' అనే కథనం ఇటీవల ప్రజాజ్యోతి దినపత్రికలో ప్రచురితం కాగా స్పందించిన అధికారులు ప్రమాదకరంగా ఉన్న బావిని మట్టితో పూడ్చివేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రజాజ్యోతి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ఎస్‌సి ప్రీ ఫైనల్ పరీక్షల కేంద్రం ఆకస్మిక తనిఖీలి

**రాయికల్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అల్లీపూర్ లో ఎస్ఎస్ సి ప్రీ ఫైనల్ పరీక్షలు రాస్తున్న పరీక్ష కేంద్రాన్ని విద్యార్థులను మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.పరీక్షా అనంతరం పిల్లలకు రాబోవు ఎస్ఎస్ సి ఫైనల్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో తగు సూచనలు, సలహాలు ఇచ్చారు పరీక్ష సమయంలో ఎలాంటి ఒత్తిడి కి గురికావద్దని, ఉపాధ్యాయులు చెప్పే సూచనలు పాటించాలని, పరీక్షలు అయ్యే వరకు పాఠశాలలో జరిగే తరగతులకు తప్పకుండ హాజరు కావాలని సూచించారు కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోరండ్ల కిరణ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి కుమార్, మల్లారెడ్డి లు పాల్గొన్నారు.



# ఉద్యోగుల ఆరోగ్య కార్డులపై ఉద్యోగ సంఘాల హర్షం..

**సిరిసిల్ల టౌన్ , ఫిబ్రవరి 24(ప్రజాజ్యోతి):**

ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేసినందుకు మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఉద్యోగ సంఘాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వనికి ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఆరోగ్య కార్డులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ పేరు మార్చి డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ గా మారుస్తూ 1.20 కోట్ల ప్రమాద బీమా, 60 సంవత్సరాల లోపు సహజ మరణం చెందితే 10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ మంజూరు చేస్తున్నట్లు క్యాబినేట్ నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, కార్మిక, ఉపాధ్యాయుల, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్




ఎలుసాని ప్రవీణ్ కుమార్, జనరల్ సెక్రటరీ, డి సమర సేన్, గాజుల సుధర్శనం లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉద్యోగుల ఉపసంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పరిశ్రమలు, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్ దామోదర రాజనరసింహ, ఐఎఎస్ అధికారుల కమిటీ సబ్యులైన నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, శ్రీ కె. రామకృష్ణారావు ప్రధాన కార్యదర్శిలకు ధన్యవాదాలు తెలిపారు. గతం లో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యగులను ప్రపంచ బ్యాంకు షరతులు అంగీకరించి నాటి ప్రభుత్వం వైద్య విధాన పరిషత్ ఏర్పాటు చేసి ఎంతో మంది ఉద్యోగులను మానసిక ఒత్తిడి కి గురిచేసిందని వైద్యవిధాన పరిషత్ ఉద్యగులకు నెల నెల జీతాలు రాక ఇబ్బందులు పడ్డారన్నారు. గత ప్రభుత్వం నుండి లభించే ఎలాంటి సౌకర్యాలు లభించేవి కావని, సమస్యల పరిష్కారానికి టీజీఈజేఏసీ తరుపున ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చామన్నారు. ఈ ప్రజాప్రభుత్వం 12500 మంది ఉద్యోగస్తులకు, 200 హాస్పిటల్స్ లలో ఒక గొప్పవరం ప్రకటించిందన్నారు. ఇక నుండి వారికి 010 పద్దు కింద నెలసరి జీతభత్యాలు, ఇతర ప్రయోజనాలు పొందుతారని, వైద్యవిధాన పరిషత్ లో పనిచేసే స్టాఫ్ నర్సుకు నర్సింగ్ ట్యూటర్ గా వెళ్ళే అవకాశం లభిస్తుందని ఇది ఉద్యోగ సంఘాల ఐక్యాతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమము లో ఉద్యోగ సంఘ నాయకులు గాజుల సుధర్శనం, సయ్యద్ జబీ, ఏ. జయంత్ కుమార్, జె. రాజు, మెట్ట శ్రీకాంత్, ఎండి రియాజ్ పాషా, కరుణాకర్, బొల్గశీ సాగర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.




## పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు-ఎక్జామ్ ప్యాడ్స్

**శంకరపట్నం, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

కరీంనగర్ జిల్లా శంకరపట్నం,మండలం, కొత్త గట్టు మెట్పల్లి కేశవపట్నం తాడికల్ కన్నాపూర్ వివిధ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు-ఎక్జామ్ ప్యాడ్స్ పంచడం జరిగింది. "సోల్జర్‌కు గన్ను -- స్టూడెంట్‌కు పెన్ను" అనే నినాదంతో సురేష్ ఆత్మారామ్ మహరాజ్ స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టబడింది. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది మరియు యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల శ్రీనివాస్ గారి ఆధ్వర్యంలో శంకరపట్నం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు సరస్వతి కటాక్షం కలిగిన పెన్నులు మరియు ఎగ్జామ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. రాబోయే పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనాలని విద్యార్థులకు ఆయన సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల అవసరమని పేర్కొన్నారు. ఈ సహాయం వారి విద్యాభ్యాసానికి దోహదపడాలని ఆకాంక్షించారు. ఇట్టి కార్యక్రమంలో అంతర్పుల శ్రీనివాస్ బత్తిని శ్రీనివాస్ జుజురి శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు గ్రామ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థను, జక్కుల శ్రీనివాస్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.

## పైపు లైన్ లీకేజీకి సమస్య పరిష్కారం

### నాగేపల్లిలో సర్పంచ్ దివ్య సుధాకర్ యాదవ్ తక్షణ చర్యలు

**మగిరి, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**



రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలోని ఏ బ్లాక్, బి బ్లాక్ టెంపుల్ ఏరియాల్లో పైపు లైన్ లీకేజీ సమస్య తలెత్తడంతో గ్రామ సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ యాదవ్ వెంటనే స్పందించారు. సమస్యను స్వయంగా పరిశీలించి, సిబ్బందితో కలిసి మరమ్మత్తు పనులు చేపట్టి లీకేజీని పరిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికులు నీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించినందుకు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తోట శీను, చిట్టెంపల్లి సాయి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆలూరు ప్రాథమిక పాఠశాలలో ప్రీ - ప్రైమరీ విద్యార్థులకు ఏకరూప దుస్తులు, షూస్, స్టేషనరీ పంపిణీ...

### ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్కేజీ , యూకేజీ ప్రారంభంతో గ్రామీణ విద్యార్థులకు మేలుకలిగిస్తుంది ... జిల్లా విద్యాధికారి కె రాము...

**రాయికల్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

రాయికల్ మండలంలోని ఆలూరు ప్రాథమిక పాఠశాలలో ప్రీ-ప్రైమరీ తరగతి విద్యార్థులకు జగిత్యాల జిల్లా విద్యాధికారి కె. రాము ఏకరూప దుస్తులు, షూస్, స్టేషనరీ పంపిణీ చేసారు. మంగళవారం జగిత్యాల జిల్లా విద్యాధికారి పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డి.. ఈ. వో మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతుల ప్రారంభంతో ప్రాథమిక విద్య మరింత బలోపేతం అవుతుందని, గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు ఎల్కేజీ, యూకేజీ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సమాన విద్యా అవకాశాలు కల్పించబడుతున్నాయని ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో, సమగ్ర ప్రణాళికలతో






పనిచేస్తోందని వివరించారు. ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు చిన్ననాటి నుంచే నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, విద్యా సామగ్రి అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఏకరూప దుస్తులు, షూస్, స్టేషనరీ పంపిణీ ద్వారా విద్యార్థుల్లో పాఠశాల పట్ల ఆసక్తి పెంపొందించడంతో పాటు తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎమ్.ఓ చంద్రశేఖర్ రెడ్డి, మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, సర్పంచ్ నల్లాల స్వామిరెడ్డి, ఎఎపిసి చైర్మన్ చిలుక విజయ, ఉపసర్పంచ్ చల్ల మహేష్ రెడ్డి, విడిసి చైర్మన్ చిలుక సంజీవ్, కార్యదర్శి నల్లాల శేఖర్, మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అక్కినపెల్లి సతీష్, ఉపాధ్యాయులు కొంగరి సాయికృష్ణ, నాగిరెడ్డి రమేష్ రెడ్డి, పసుల సునీత, తల్లిదండ్రులు, గ్రామస్థులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ పద్ధతులతోనే అధిక దిగుబడులు

### మండల వ్యవసాయ అధికారి చంద్ర దీపక్

**మల్యాల, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

రైతులు తమ భూమి స్వభావాన్ని తెలుసుకుని, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని మండల వ్యవసాయ అధికారి కె. చంద్ర దీపక్ అన్నారు. మంగళవారం మానాల గ్రామంలోని రైతు వేదికలో 'ఆత్మ' ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో "భూసార పరీక్షలు - రసాయనిక ఎరువుల వినియోగం" అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పాటించాల్సిన ముఖ్యమైన సూచనలను వివరించారు.

### భూసార పరీక్ష - పెట్టుబడికి రక్షణ

ప్రతి రైతు తమ పొలంలో మట్టి నమూనాలను సేకరించి దగ్గరలోని కెవికె లేదా వ్యవసాయ పరిశోధన కేంద్రాలకు పంపాలని కోరారు. పరీక్ష అనంతరం వచ్చే భూసార కార్డు ఆధారంగా ఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకుని, సిఫారసు చేసిన మేరకే ఎరువులు వాడాలని సూచించారు. దీనివల్ల అనవసరపు



ఖర్చు తగ్గడమే కాకుండా, ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని తెలిపారు.

### ఎరువులు వేసే సరైన పద్ధతి

అడుగు మందులు డి.ఎ.పి , 20:20:0:13, 28:28:0 వంటి ఎరువులను పంట వేయడానికి ముందే దుక్కిలో వేసుకోవాలి. వీటిని పైపాటుగా వేస్తే మొక్కలకు పూర్తిస్థాయిలో అందవని స్పష్టం చేశారు.

పైపాటు ఎరువులు యూరియా, పొటాష్ వంటి వాటిని పంట వేసిన 20 రోజుల తర్వాత దశల వారీగా వేసుకోవాలి. సూక్ష్మ పోషకాలు ఐరన్, జింక్, బోరాన్, మెగ్నీషియం వంటి లోపాలను గమనించి తక్కువ మె-ంత్తంలో పిచికారీ చేయాలని సూచించారు.



### భూసారం పెంచే మార్గాలు

రసాయన ఎరువులతో పాటు పశువుల ఎరువు, కోళ్ల ఎరువు, గొర్రెల ఎరువు మరియు వర్మి కంపోస్టు వంటి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని కోరారు. అలాగే జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువులను సాగు చేసి భూమిలో కలియదున్నాలని, పి.ఎస్.బి, రైజోబియం, అజోల్లా వంటి జీవన ఎరువుల వల్ల భూసారం గణనీయంగా పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఏ. మంజుల, ఎస్. శ్రీలేఖ మరియు రైతులు జుట్టు గంగారెడ్డి, ఎడిపల్లి తిరుపతి, మహేష్, కొత్త మోహన్, మల్లయ్య, కె. రాజయ్య, హనుమంతు, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేడీసీసీ బ్యాంకు ఖాతాదారులకు సైబర్ క్రైమ్ నేరలపై అవగాహన

**ముత్తారం ఫిబ్రవరి,24 (ప్రజా జ్యోతి)**

మండలంలోని కేడీసీసీ బ్యాంకు అధికారులు ఖాతాదారులకు సైబర్ నేరాల పట్ల అవగాహన చేశారు. ఆన్లైన్ లావాదేవీలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ విష్ణు భక్తుల ప్రసాద్ మంగళవారం రోజున మండలం లోని కేశనపల్లి గ్రామంలో కేడీసీసీ బ్యాంక్ ఆధ్వర్యంలో మేనేజర్ ప్రసాద్ ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత లావాదేవీల పై అవగాహన కల్పించారు సైబర్ భద్రతపై ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు పీఎం జైజై వై రు. 436/- 20/- బ్యాంకులో ఉన్న ప్రతి ఖాతాదారుడు ఇన్సూరెన్స్ చేసుకోవలని సూచించారు 18 సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వరకు పి ఎం జె బి వై మరియు



70 సంవత్సరాల పైబడిన వారికి పీఎం ఎస్బిఐ ఇన్సూరెన్స్ తప్పకుండా చేసుకోవలన్నారు. ఓటిపి , ఏటీఎం పిన్ నెంబర్స్ ఎవరికి తెలుపకూడదని ఏపీకె లింక్స్ గాని వాట్సాప్ లింక్స్ గాని ఓపెన్ చేయవద్దని అన్నారు కే డి సి సి బ్యాంక్ కొత్తగా సౌభాగ్య ఫిక్స్ డిపార్ట్ స్కీమ్ తీసుకురావడం జరిగినదని దీని కాలపరిమితి 333 రోజులకు 8.5% వడ్డీ ఉంటుందని అన్ని బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ పొందవచ్చని అన్నారు ఈ అవకాశం 31 మార్చ్ 2026 వరకు మాత్రమే ఉంటుందని ఈ డిపాజిట్ ను సద్వినియోగం చేసుకోవలని అన్నారు బ్యాంకు లో ప్రతి ఒక్కరు ఎస్బి అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని కోరారు. బ్యాంకు నుంచి వివిధ రుణములు క్రాప్ లోన్స్ మార్ట్ గేజ్ లోన్స్ ఎడ్యుకేషన్ లోన్స్ హౌసింగ్ లోన్స్ వివిధ రుణములు ఇవ్వబడుతయని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పేగడ తిరుమల కుమార్ సిఎల్ఎఫ్ సభ్యులు ఖాతాదారులు రైతులు పాల్గొన్నారు.



## రామాజీపేటలో మొదటి వార్డు సందర్శన కార్యక్రమానికి శ్రీకారం

**రాయికల్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

రామాజీపేట గ్రామంలో ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించేందుకు ప్రతి మంగళవారం ఒక్కో వార్డును సందర్శించే కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ ప్రారంభించింది. ఈరోజు మొదటి వార్డులో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి, ఆశా వం-కర్లు, అంగన్వాడి టీచర్లు, జీపీవో సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి పర్యటించారు. వార్డులో తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధిదీపాలు, రహదారులు తదితర సమస్యలను పరిశీలించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. గుర్తించిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని సర్పంచ్ తెలిపారు. ప్రతి వారం ఒక వార్డును సందర్శించడం ద్వారా గ్రామ అభివృద్ధి వేగవంతమవుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## సర్వరాజ్ పూర్ కాంగ్రెస్ యూత్ వింగ్ ఏర్పాటు

**ప్రజా జ్యోతి కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**





కోరుట్ల మండలంలోని సర్వరాజ్ పూర్ గ్రామంలో ఈరోజు కాంగ్రెస్ యూత్ వింగ్ ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ యూత్అధ్యక్షునిగా సంఘ రవి, ఉపాధ్యక్షునిగా తొగరి అజయ్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో తోట గంగాధర్, తోట నర్సయ్య, కొక్కు తిరుపతి, కొక్కు గంగారెడ్డి, ధ్యానవేణి మల్లయ్య ,తొగరి చంద్రమౌళి, సిమ్మల్లా మధు,తొగరి రమేష్, సంఘ గంగ మల్లయ్య, పొట్టి శ్రీనివాస్,పాల లక్ష్మీ నర్సయ్య, నాగెల్లి సాగర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.



## క్రీడాకారిణులను సన్మానించిన ఎమ్మెల్యే సత్యనారాయణ

**తిమ్మాపూర్ , ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామం లో మంగళవారం రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల్లో ప్రతిభకనబర్చిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సన్మానించారు. మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో సీఎం కప్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ,అంతర్జాతీయ వేదికలపై మన క్రీడాకారులు రాణించాలన్నారు.పతకాలు సాధిస్తూ మన కీర్తిని ఖండాంతరాలు దాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మానగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్, ఉప సర్పంచ్ కేతిరెడ్డి లింగారెడ్డి, హైస్కూల్ విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుమ్మెర మల్లన్న జాతర కులవివక్ష ఘటనపై బీసీ సంఘాల నిరసన

**రామగిరి, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

పెద్దపల్లి జిల్లా రామగిరి మండలంలో కులవివక్షతో జరిగిన పసికందు హత్య ఘటనపై రజక సంఘం, బీసీ సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా చోటుచేసుకున్న ఈ దారుణ ఘటనను ఖండిస్తూ, సెంటెనరీ కాలనీ మార్కెట్ చౌరస్తాలో అంబేద్కర్, ఫూలే విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రజక సంఘం జిల్లా సమన్వయకర్త నాగెల్లి సాంబయ్య, బీసీ సంఘం రాష్ట్ర నాయకురాలు దాసరి ఉష, రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావులు మాట్లాడుతూ, కుల పిచ్చితో అమాయక పసికందును హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంలో ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బీసీ సంఘం మంథని డివిజన్ అధ్యక్షుడు నూనె రాజేశం, బీఎస్పీ నాయకుడు జనగామ రవికుమార్, బీఆర్ఎస్ నాయకుడు ఆసం తిరుపతి మాట్లాడుతూ రాష్ట్రంలో కుల వివక్ష, దాడులు, గ్రామ బహిష్కరణలు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ నల్లవెల్లి శంకర్, సీనియర్ జర్నలిస్ట్ పీవీ రావు, నల్లూరి లింగయ్య, బీసీ జేఏసీ నాయకురాలు అరుణ, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాదాసి శ్రీనివాస్, రజక విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు బండి రంజిత్ కుమార్, రామగిరి మండల అధ్యక్షుడు ధర్మల రాజయ్య, పట్టణ అధ్యక్షుడు పొన్నం సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి బండి మొండయ్య, అలాగే రజక సంఘం నాయకులు నస్పూరి రాయమల్లు, చెలికట్ల మల్లేష్, కొదురుపాక భీమయ్య, అలివాల రాజు, కొల్లూరి రాములు, ధర్మల శ్రీనివాస్, ధర్మల భూమయ్య, ముస్కే రాజు, రేగళ్ల రాజేశం, లక్ష్మణ్, బండి సాయి, ధర్మల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలి

**సిపియు కవిత దేవి**

**చొప్పదండి, ఫిబ్రవరి 24(ప్రజా జ్యోతి):**

విద్యార్థులు మంచి లక్షణాలు అలవర్చుకొని ఎలాంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా తమను తాము కాపాడుకుంటూ విద్య లో ముందజలో ఉండాలని జిల్లా చైల్డ్ ప్రొటక్షన్ యూనిట్ అధికారిని కవిత దేవి అన్నారు. చొప్పదండి మండలం వెదురుగట్ట ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థిని, విద్యార్థులకు తమ భద్రత పై అవగాహన కల్పించాలనే లక్ష్యం తో సన్నిహిత అనే కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా హాజరైన డీసీపీయు అధికారిని కవిత దేవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యాసనాలకు అలవాటు కాకుండా విద్య పైన దృష్టి ని కేంద్రికరించి చదువుకోని రానున్న రోజుల్లో ఉన్నత విద్యలు మరెన్నో చదువు కోవాలని అన్నారు. సమాజం లో విద్యార్థుల పై జరుగుతున్న అరాచకాలను వివరించారు. విద్యార్థులు ఈ వయస్సులో తమ భద్రత ను గుర్తు చేశారు. ఏవైనా అలాంటి సంఘటన ఎదురైతే పాఠశాల ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు చెప్పాలన్నారు. విద్యార్థి దశనే జీవితం లో ముఖ్యమని, ఇప్పటి నుండే ఉన్నత చదువుకు దిశ నిర్దేశం ఏర్పడుతుందని అన్నారు. టీనేజీ పిల్లలపై పడే ప్రభావాలను గుర్తు చేశారు.విద్యార్థి దశలో విద్యార్థులు ఎలా ఉండాలో వివరించారు .విద్యార్థులు క్రమశిక్షణ తో ఉండాలని అన్నారు. బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, ఐసిడిఎస్ సూపర్ వైజర్ నాశ్రత్, గ్రామ సర్పంచ్ పెంచాల శ్రీనివాస్,గ్రామ ఉపసర్పంచ్ సమత, వైద్యులు సురేందర్, సిహెచ్ఓ వెంకటస్వామి,గ్రామ ఎన్ ఎం లక్ష్మి, ఐకేపి సిఏలు కార్తీక,లావణ్య, అంగన్వాడీ టీచర్ లు రమ, లక్ష్మి నర్సమ్మ, జమున, కమల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# అప్పుల వేధింపులకు వివాహిత బలి

### భర్త ఫిర్యాదుతో స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

**మల్యాల, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**



అప్పు ఇచ్చిన వారి వేధింపులు తాళలేక ఓ వివాహిత కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాల్యాల మండలం రాజారాం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.నూకపల్లి అర్బన్ కాలనీకి చెందిన కనగల అనూష (39) జగిత్యాలలో టైలరింగ్ చేస్తూ జీవనం సాగిస్తోంది. గతంలో విజయవాడకు చెందిన శిరీష అనే మహిళ వద్ద అనూష రూ. ఒక లక్ష అప్పు తీసుకుంది. ఆర్థిక ఇబ్బందుల వల్ల కొంత డబ్బు చెల్లించినా, మిగిలిన బాకీ కోసం శిరీష తన అనుచరులు నౌషిత, సతీష్, ఓంకార్‌లతో కలిసి మంగళవారం ఉదయం అనూషను కలిసి తీవ్రంగా వేధించారు."డబ్బులు కట్టకపోతే చావనైనా చావు" అంటూ వారు దుర్భాషలాడటంతో తీవ్ర మనోవేదనకు గురైన అనూష, జగిత్యాలకు ఆటోలో వెళ్తూ మార్గమధ్యలో రాజారం గ్రామ శివారులోని కాకతీయ కాలువలో దూకి ప్రాణాలు వదిలింది. మృతురాలి భర్త లక్ష్మణ్ బాబు ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. నరేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

# రామగుండం కార్పొరేషన్ ఎన్నికలపై ఫిర్యాదు

### 43 డివిజన్లలో రీ పోలింగ్ నిర్వహించాలని బీఆర్ఎస్ డిమాండ్

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ 43 డివిజన్లలో తిరిగి పోలింగ్ నిర్వహించాలని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదు సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ప్రభావంతో బీఆర్ఎస్ నాయకులను బెదిరించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకున్నారని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద విద్యుత్ సరఫరా నిలిచిన సమయంలో ఓట్ల మార్పిడికి పాల్పడ్డారని అనుమానం వ్యక్తం చేశారు. బ్యాలెట్ బాక్స్‌లు తెరిచినప్పుడు అధికంగా కాంగ్రెస్‌కు ఓట్లు నమోదవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. డివిజన్‌ల వారీగా ప్రజలు తాము బీఆర్ఎస్‌కే ఓటు వేశామని తెలిపిన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో పాక్షికంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరిన ఆయన, తక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయిస్తామని హెచ్చరించారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 43 డివిజన్లలో రీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణదాసు మారుతి, పెద్దపల్లి పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి

**సీఎస్ కె.రామ కృష్ణ రావు**

**ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ థియరీ పరీక్షల నిర్వహణ**

**పరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి**

**ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలి**

**పరీక్షా సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి**

**ఇంటర్ పరీక్షల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీఎస్**

**పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి:**





ఇంటర్ పరీక్షలను రాష్ట్రంలో కట్టుదిట్టంగా నిర్వహించాలని సి.ఎస్.కే రామకృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఎస్ కె.రామ కృష్ణ రావు ఇంటర్ పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ కె.రామ కృష్ణ రావు మాట్లాడుతూ, ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాలకు ఎవరికీ సెల్ ఫోన్ తీసుకుని రావడానికి అనుమతి లేదని, సీసీ కెమెరాల సమక్షంలోనే ప్రశ్నాపత్రాలు సీల్ ఓపెన్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రవేశద్వారం వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని,పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్ లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి కల్పన, జిల్లా విద్యాశాఖ అధికారి శారద, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య,జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో ఘనంగా శ్రీనుబాబు జన్మదిన వేడుకలు

### రక్తదానం, పండ్ల పంపిణీతో సేవా సంకల్పం - ప్రజాసమస్యల పరిష్కారానికి నిత్య పోరాటం : నేతల కొనియాడింపు

**మంథని, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సోదరులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు జన్మదిన వేడుకలను మంథనిలో మంగళవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, కౌన్సిలర్లు పెంటరి రాజు, మారుపాక నిహారిక, ఎల్లంకి వంశీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఐలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాధుల శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మాజీ చైర్‌పర్సన్ శ్రీరాంభట్ల సంతోష్, రాష్ట్ర విద్యుత్ బోర్డు సభ్యుడు శశి భూషణ్ కాచే, మాజీ ఎంపీపీ కొండ శంకర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఆర్టీఏ సభ్యుడు మంథని సురేష్, పార్టీ సీనియర్ నాయకులు బండ కిషోర్ రెడ్డి, మంథని సత్యం, మంథని రాకేష్ లు పాల్గొని.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వర్గీయ మాజీ స్పీకర్ శ్రీపాదరావు ఆశయ సాధనలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు అండగా నిలుస్తూ, నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటున్న వ్యక్తి శ్రీనుబాబు అని కొనియాడారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమిస్తూ, ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడిగా నిలుస్తున్న సేవాగుణ సంపన్నుడు శ్రీనుబాబు అని ప్రశంసించారు. అర్ధరాత్రి అయినా సరే యువతకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మార్గనిర్దేశం చేస్తూ, వెన్నుతట్టి ప్రోత్సహించే నిస్వార్థ సేవకుడిగా శ్రీనుబాబు నిలుస్తున్నారని తెలిపారు. ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.





# విద్యార్థులు పరీక్షల భయం వీడాలి

### సైకాలజిస్ట్ కె. పున్నంచందర్..

**సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి):**

హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ, తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బద్దెనపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పరీక్షల ఒత్తిడి పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీ కె. పున్నంచందర్ విద్యార్థులకు కౌన్సిలింగ్ అందించారు. ఈ సందర్భంగా పున్నంచందర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలను భయంగా కాకుండా ఒక అవకాశంగా చూడాలి. సరైన ప్రణాళిక, సమయపాలన, సానుకూల దృక్పథం ఉంటే పరీక్షలలో విజయం సాధించవచ్చని తెలిపారు. పరీక్షల ముందు కలిగే ఆందోళన, భయం, నిద్రలేమి వంటి లక్షణాలను ఎలా నియంత్రించుకోవాలో ఆయన వివరించారు. విద్యార్థులకు మైండ్ మ్యాపింగ్ పద్ధతి గురించి సమగ్రంగా వివరిస్తూ, ఒక అంశాన్ని చిత్ర రూపంలో విభజించి చదివితే సులభంగా గుర్తుంచుకోవచ్చని తెలిపారు. ముఖ్యాంశాలను శాఖల రూపంలో రాసుకుంటే మెమొరీ శక్తి పెరుగుతుందని అన్నారు. మెమొరీ టెక్నిక్స్ గురించి వివరించి, అసోసియేషన్ పద్ధతి విజువలైజేషన్ టెక్నిక్, రిపిటిషన్ పద్ధతి, కీవర్డ్ టెక్నిక్స్ వంటి విధానాలను ఉపయోగించడం ద్వారా చదివిన విషయాలను ఎక్కువకాలం గుర్తుంచుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అలువల ఈశ్వర్, మండల విద్యాధికారి భూక్యా రాజు నాయక్, ఉపాధ్యాయులు శంకర్, తిరుపతిరెడ్డి, రంజీ నాయక్, విక్రమ్, రమణ విద్యార్థులు పాల్గొని ఆసక్తిగా సందేహాలు అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ అవగాహన కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.



## మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ యాప్ పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

**కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్**

**మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ పై జిపిఓ, ఆర్.ఐ లకు అవగాహన కల్పించిన కలెక్టరేట్ ఏఓ**

పెద్దపల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :



మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ పై సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.ప్రకాష్ మొబైల్ యాప్ వినియోగం పై సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిపిఓ, ఆర్.ఐ లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రకాష్ మాట్లాడుతూ,ప్రజలకు ఆదాయ ధృవీకరణ పత్రం యాప్ ద్వారా జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించి మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ ప్రవేశ పెట్టిందని, త్వరలోనే ఈ యాప్ ద్వారా ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని అన్నారు. మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగం పై గ్రామపంచాయతీ అధికారులు, ఆర్.ఐ లు, ఇతర రెవెన్యూ సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత సమయంలో మన లాగిన్ లోకి వచ్చిన అన్ని దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా డిస్పోస్ చేయాలని అన్నారు. అనంతరం మీసేవ ఫీల్డ్ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగం పై ఈ.డి.ఎం కవిత విస్తృతంగా శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలన అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు కృషి చేయాలి

**నూతన సర్పంచులకు ధృవీకరణ పత్రాల అందజేత**

**ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**

పెద్దపల్లి ప్రతినిది, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :





గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం సర్పంచ్‌లు ప్రజలకు అందుబాటులో ఉండి నిరంతరం కృషి చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సూచించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లి పట్టణంలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన నూతన సర్పంచుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎలిగేడు, జూలపల్లి, ముత్తారం, అంతర్గం, ధర్మారం, రామగిరి మండలాలకు చెందిన పలు గ్రామాల నూతనంగా ఎన్నికైన సర్పంచులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలులో పారదర్శకత పాటిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులకు ఎమ్మెల్యే ధృవీకరణ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వివిధ మండలాల సర్పంచులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నారాయణపూర్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మొక్కులు సమర్పించిన ఎమ్మెల్యే

**ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ**

**పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు**

సుల్తానాబాద్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :



సుల్తానాబాద్ మండలంలోని నారాయణపూర్ గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మొక్కులు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామ పెద్దలు, గౌడ సంఘ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేలా ఆలయాల నిర్మాణం జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. రేణుకా ఎల్లమ్మ తల్లి కృపాకటాక్షాలు గౌడ కులస్థులకు మాత్రమే కాకుండా గ్రామ ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ సమగ్రాభివృద్ధికి ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గౌడ కులస్తులు ఏకమై ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడం అభినందనీయమని, ఈ ఆలయం భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని అన్నారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా గుడి ప్రహరీ గోడ నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేసే దిశగా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. గ్రామ ప్రజల అవసరాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మండల రమేష్, కొండల్ రావు, మాధవరావు, గౌడ కుల పెద్దలు బుర్ర బాణయ్య, బాలసాని శ్రీనివాస్, మూల హరీష్, బాలసాని సురేష్, మారేడుగొండ సధి, పడాల శంకర్, వెగోళపు మల్లికార్జున్, తాళ్లపల్లి రాజు, పొన్నం రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగర్ రావు, ఎలిగేటి సధి, ఆకుల నగేష్, కల్లెపల్లి శంకర్ తోపాటు గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల అరెస్టులకు నిరసనగా మండల కేంద్రంలో ధర్నా

ముస్తాబాద్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :



అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్న ఆశా వర్కర్ల అరెస్టులను ఖండిస్తూ ఆశా వర్కర్లు ఆందోళనకు దిగారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి ప్రధాన కూడలి వద్ద ఆశాలు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో శాంతియుతంగా నిరసన తెలపడానికి సిద్ధమవుతుండగా ముందస్తు అరెస్టులు చేయడం అన్యాయమని ఆశా వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, పెండింగ్ డిమాండ్లపై ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ధర్నా కారణంగా కొంతసేపు రాకపోకలకు అంతరాయం కలిగింది.

## ప్రాణం తీసిన అప్పు.... కుటుంబంలో తీవ్ర విషాదం....

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :



ఆర్థిక ఇబ్బందులు,అప్పులు ఓ కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచాయి.చేసిన అప్పులు తీర్చలేక పోయిన ఓ మహిళ అవమాన భారంతో కాలువలో దూకి ఆత్మహత్య కు పాల్పడిన ఘటన కలకలం రేపింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కనగలా అనూష (40) కుటుంబం కొన్నేళ్ల క్రితం తెలంగాణకు వలస వచ్చి నివాసం ఉంటుంది.ప్రస్తుతం వారు నూకపెల్లి అర్బన్ కాలనీలో నివాసం ఉంటున్నారు.కుటుంబ అవసరాల కోసం అనూష విజయవాడలోని కంకిపాడు ప్రాంతానికి చెందిన వ్యక్తుల వద్ద కొంత మొత్తంలో డబ్బు అప్పుగా తీసుకున్నట్లు సమాచారం.అయితే అప్పు తిరిగి చెల్లించలేదని కంకిపాడు ప్రాంతానికి చెందిన వ్యక్తులు అనూష ఇంటి వద్దకు వచ్చి దౌర్జన్యానికి పాల్పడ్డారని స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో తీవ్ర మనస్థాపానికి గురి అయిన అనూష అవమానాన్ని తట్టుకోలేక ధరూర్ లోని ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుంది.మృతురాలికి భర్త తో పాటు ఇద్దరు కూతుర్లు కూడా ఉన్నారు.ఘటన పై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





## పట్టణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌పై దృష్టి పెట్టాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**మార్చ్ 5 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లు బేస్మెంట్ స్థాయికి చేరుకోవాలి**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

ప్రతినిధి ,(ప్రజాజ్యోతి), ఫిబ్రవరి 24:

పట్టణ ప్రాంతాలలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనుల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగిసినందున పట్టణాలలో నూతనంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పై అధికారులు దృష్టి సారించాలని, ప్రతి వార్డు పరిధిలో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తూ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల మార్చ్ 5 నాటికి బేస్మెంట్ స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పనులు, స్వచ్ఛ భారత్ మిషన్ క్రింద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి వచ్చే చెల్లిపులు లబ్ది దారుల అందరికీ చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మండల పరిషత్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులలో పెట్టుబడి సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందించాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎల్2 జాబితాలోని లబ్ధిదారులను ఎంపిక చేసి అట్టి లబ్ది దారులతోనే 2 దీఎఖ పతకం ఇండ్ల క్రింద నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపిడిఓ లు,ఏ.ఈ.లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాల దెబ్బకు నష్టపోయాయి రైతులకు తక్షణ పరిహారం ఇవ్వాలి

దావ వసంత సురేష్

రాయికల్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి)





రాయికల్ మండలం రామాజీపేట గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో మొక్కజొన్న పంటలు మరియు మామిడి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పంట నష్టాన్ని జిల్లా తొలి తాజా మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ రైతులు మరియు బిఆర్ఎస్ పార్టీనాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షాలు రైతులను నష్టాల్లోకి నెట్టేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సాగునీరు, 24 గంటల విద్యుత్ సరఫరాలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు తగిన మద్దతు అందించడంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రకృతి విపత్తుతో పాటు ప్రభుత్వ వైఫల్యం రైతులపై ద్వంద్వ భారం మోపిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి నష్టపోయిన పంటలను అధికారులతో అంచనా వేయించి, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతులకు తక్షణ పంట నష్ట పరిహారం అందజేయాలని ఆమె డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునే చర్యలు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, కో–ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, ప్రధాన కా ర్యదర్శి రత్నాకర్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉదయ శ్రీ, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, నాయకులు దుగ్యాల రమాపతి రావు అంబల్ల రాంరెడ్డి,రాజేందర్ గౌడ్, ప్రశాంత్ రావు, సత్యం గౌడ్, గంగారం లక్ష్మణ్, కన్నాక మహేందర్, గడ్డం మల్లారెడ్డి, నరేష్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.



## నవజాత కవల శిశువులకు విజయవంతమైన చికిత్స

### మాతాశిశు ఆసుపత్రి వైద్యుల సేవలకు ప్రశంసలు

పెద్దపల్లి ప్రతినిధి , ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :



పెద్దపల్లి పట్టణానికి చెందిన ఓ మహిళకు నెలలు నిండక ముందే తక్కువ బరువుతో జన్మించిన కవల నవజాత శిశువులకు పెద్దపల్లి మాతాశిశు ఆసుపత్రిలో వైద్యులు అత్యుత్తమ చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఈ నెల 6వ తేదీన ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవం జరిగిన అనంతరం తక్కువ బరువుతో జన్మించిన శిశువులకు శ్వాసకోశ సమస్యలు తలెత్తడంతో ఊపిరి తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో వెంటనే శిశువులను మాతాశిశు ఆసుపత్రిలోని ఎస్ఎన్సీయూ విభాగంలో చేర్పించారు. పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వాసుదేవ రెడ్డి నేతృత్వంలో వైద్యులు డాక్టర్ రవీందర్, డాక్టర్ అనూష రెడ్డి, డాక్టర్ రవి, డాక్టర్ సిరి చందన, డాక్టర్ మహేష్ సమన్వయంతో శిశువులకు ప్రత్యేక చికిత్స అందించారు. శ్వాస సమస్యను అధిగమించేందుకు సీప్యాప్ పరికరం ద్వారా ఆక్సిజన్ అందించడంతో శిశువుల శ్వాసక్రియ క్రమంగా మెరుగుపడింది. ఇన్ఫెక్షన్ నివారణకు అవసరమైన మందులు, యాంటీబయోటిక్స్, గ్లూకోజ్ చికిత్సతో పాటు తల్లి పాలు, కంగారు మదర్ కేర్ విధానం మరియు మిల్క్ సప్లిమెంట్స్ అందించడంతో శిశువుల ఆరోగ్యం మెరుగుపడి బరువు కూడా పెరిగింది. సుమారు 19 రోజులపాటు వైద్య పర్యవేక్షణలో చికిత్స పొందిన అనంతరం శిశువులు పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యారు. అనంతరం తల్లికి శిశు సంరక్షణపై అవసరమైన సూచనలు, నెలనెలా వైద్య పరీక్షల వివరాలను నర్సింగ్ సిబ్బంది తెలియజేశారు. నవజాత కవల శిశువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి విజయవంతంగా చికిత్స అందించిన వైద్య బృందం, ఎస్ఎన్సీయూ సిబ్బందిని ఆసుపత్రి సూపరింటెండెంట్ లిలిడాక్టర్ శ్రీధర్ అభినందించారు.



## మంథనిలో ఘనంగా శ్రీనుబాబు జన్మదిన వేడుకలు

### రక్తదానం, పండ్ల పంపిణీతో సేవా సంకల్పం – ప్రజాసమస్యల పరిష్కారానికి నిత్య పోరాటం : నేతల కొనియాడింపు

మంథని, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :

రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సోదరుడు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు జన్మదిన వేడుకలను మంథనిలో మంగళవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదానం చేసి, రోగులకు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, కౌన్సిలర్లు పెంటరి రాజు, మారుపాక నిహారిక, ఎల్లంకి వంశీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఐలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాధుల శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, మాజీ చైర్పర్సన్ శ్రీరాంభట్ల సంతోష్, రాష్ట్ర విద్యుత్ బోర్డు సభ్యుడు శశి భూషణ్ కాచే, మాజీ ఎంపీపీ కొండ శంకర్, మాజీ సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఆర్టీఏ సభ్యుడు మంథని సురేష్, పార్టీ సీనియర్ నాయకులు బండ కిషోర్ రెడ్డి, మంథని సత్యం, మంథని రాకేష్ లు పాల్గొని.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వర్గీయ మాజీ స్పీకర్ శ్రీపాదరావు ఆశయ సాధనలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు అండగా నిలుస్తూ, నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటున్న వ్యక్తి శ్రీనుబాబు అని కొనియాడారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం శ్రమిస్తూ, ఆపదలో ఉన్నవారికి ఆపద్బాంధవుడిగా నిలుస్తున్న సేవాగుణ సంపన్నుడు శ్రీనుబాబు అని ప్రశంసించారు. అర్ధరాత్రి అయినా సరే యువతకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మార్గనిర్దేశం చేస్తూ, వెన్నుతట్టి ప్రోత్సహించే నిస్వార్థ సేవకుడిగా శ్రీనుబాబు నిలుస్తున్నారని తెలిపారు. ప్రజాసేవే ధ్యేయంగా ముందుకు సాగుతున్న ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాష్ట్రస్థాయిలో రజత పతకం సాధించిన జెడ్పిహెచ్ఎస్ మేడిపల్లి విద్యార్థిని

మేడిపల్లి , ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :



జె ఎన్ ఎస్ స్టేడియంలో హనుమకొండలో నిర్వహించిన సెకండ్ ఎడిషన్ సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో జెడ్పిహెచ్ఎస్ మేడిపల్లి విద్యార్థిని పి. భవాని రజతపతకం సాధించి ప్రతిభ కనబర్చింది. రాష్ట్ర స్థాయిలో మెరిసిన ఈ విజయంతో పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హమీద్, పీడీ పుష్పలత మరియు ఉపాధ్యాయుల బృందం విద్యార్థినిని అభినందించి, భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. గ్రామ సర్పంచ్ మకిలి దాసు భవానిని ప్రత్యేకంగా అభినందించి, గ్రామానికి పేరు తీసుకువచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపారు.

## భూసార పరీక్షలతోనే అధిక దిగుబడులు

బీర్ పూర్ ఏఓ నీల తిరుపతి

బీర్ పూర్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) : బీర్ పూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతులకు భూసార పరీక్షలు మరియు ఎరువుల వాడకంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి నీల తిరుపతి ఆధ్వర్యంలో, 'ఆత్మ' సంస్థ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ తిరుపతి మాట్లాడుతూ, రైతులు సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికి శాస్త్రీయ పద్ధతిలో సాగు చేయాలని సూచించారు. ప్రధానంగా భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ.. పొలంలో మట్టి నమూనాలను ఎలా సేకరించాలో రైతులకు ప్రత్యక్షంగా వివరించారు.

### అవగాహన సదస్సులోని ముఖ్యాంశాలు:

ఎరువుల యాజమాన్యం: భూసార పరీక్షల నివేదిక ఆధారంగానే ఎరువులు వాడాలని, మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడితే పంటలు త్వరగా చీడపీడల బారిన పడతాయని హెచ్చరించారు. సేంద్రియ సాగు: రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచడం ద్వారా భూమి సారవంతం అవుతుందని తెలిపారు. పంట మార్పిడి: ఒకే రకమైన పంటలు వేయకుండా పంట మార్పిడి పద్ధతిని పాటించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అయ్యోరి వినోద్, వద్దూరి శిరీషతో పాటు మండలంలోని వివిధ గ్రామాల రైతులు, మహిళా రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కార్పొరేటర్లతో కలెక్టర్, సీపీని కలిసిన వెలిచాల రాజేందర్ రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :



ఇటీవల నూతనంగా ఎన్నికైన కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ అభ్యర్థులతో కలిసి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి,పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం లకు పూల మొక్కలు అందజేశారు. అనంతరం పలు అభివృద్ధి, పరిపాలనా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ, రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నారని, ఇంకా అభివృద్ధి వేగవంతం చేసేందుకు వినూత్న కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే జిల్లాలో శాంతిభద్రతలు బాగా ఉన్నాయని, అందులో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కాంటెస్టెడ్ అభ్యర్థులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



**గంభీరావుపేట, ఫిబ్రవరి 24 (ప్రజా జ్యోతి):**

ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల గంభీరావుపేటలో కెరీర్ గైడ్ ఇన్ సెల్ ఆధ్వర్యంలో జాబు మేళా నిర్వహించబడుతుందని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విజయలక్ష్మి మాట్లాడుతూ గంభీరావుపేట డిగ్రీ పూర్తి చేసుకున్నవారు మరియు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని, తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల గంభీరావుపేటలో ఫిబ్రవరి 26 గురువారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. 26 సంవత్సరాలు మరియు ఆ లోపు వారు అర్హులు మరిన్ని వివరాలకు కళాశాల కెరీర్ గైన సెల్ కన్వీనర్ డాక్టర్ శ్రవణ్ కుమార్ మొబైల్ నెంబర్ 9491598584, కంప్యూటర్ అధ్యాపకులు కృష్ణ ప్రసాద్ మొబైల్ నెంబర్ 9704118815 లను సంప్రదించాలని ప్రిన్సిపల్ తెలిపారు.

# ఘనంగా దుద్దిల్లా శ్రీనుబాబు జన్మదిన వేడుకలు

## జిల్లా సర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహణ

**పెద్దపల్లి ప్రతినిధి , ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**



:పీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్లా శ్రీనుబాబు జన్మదిన వేడుకలను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. జిల్లా సర్పంచ్ ఫోరం నాయకుడు ఆర్ల నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, లద్నాపూర్ సర్పంచ్ వనం రామచంద్రరావు కేక్ కట్ చేసి శ్రీనుబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నాయకుడు శ్రీనుబాబు అని కొనియాడారు. ఆయురారోగ్యాలతో నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తులో పార్టీలో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో శ్రీనుబాబు సేవలు విశేషమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తారం మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బియ్యని శివకుమార్, పన్నూరు సర్పంచ్ మహేష్, తోటగోపాయ్యపల్లి సర్పంచ్ రమేష్, నగరంపల్లి సర్పంచ్ శ్రీలత, నాగారం సర్పంచ్ శ్రీదేవి రెడ్డి, కన్నాల సర్పంచ్ గట్టయ్యతో పాటు పలువురు సర్పంచులు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం

**కోనరావుపేట, ఫిబ్రవరి.24(ప్రజాజ్యోతి)**

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు పరీక్షల సమయంలో ఎదుర్కొనే ఒత్తిడి మరియు మానసిక ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మానసిక వైద్యులు డా: ప్రవీణ్ కుమార్ ,మాట్లాడుతూ పరీక్షల భయం ఆందోళన ఎలా నియంత్రించుకోవాలి సమయాన్ని సమర్థవంతంగా ఎలా వినియోగించుకోవాలి యోగ ధ్యానం సానుకూల ఆలోచనల ప్రాముఖ్యత వంటి అంశాలపై విలువైన సూచనలు చేశారు. అలాగే ఒత్తిడిని ఎదుర్కొనేందుకు సరైన నిద్ర ఆహారం అధ్యయన విధానం ఎంత ముఖ్యమో వివరించారు ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వేణుమాధవ్ ,మరియు ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

## ఆడబిడ్డల కళ్యాణంతో తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



**సుల్తానాబాద్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

సుల్తానాబాద్ మండల కేంద్రంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్తో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 99 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.99,11,484 విలువైన కల్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ చెక్కులను చింతకుంట విజయరమణారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్లు సంతోషకరంగా జరిగి తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం వెల్లివిరియాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. గత పాలకులు తొమ్మిది సంవత్సరాల కాలంలో రేషన్ కార్డుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. మండలంలో కొత్తగా 22,152 రేషన్ కార్డులు అందించామని, మొత్తం కుటుంబ సభ్యుల సంఖ్య 63,836కి చేరిందని వెల్లడించారు. ప్రతినెల 357.856 క్వింటాల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో హామీ ఇచ్చిన ప్రతి పథకాన్ని అమలు చేస్తామని, అర్హులైన వారందరికీ పింఛన్లు అందజేస్తామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాల పాలనలో సుల్తానాబాద్ మండలాన్ని నిర్లక్ష్యం చేసిందని, పలు కార్యాలయాలను తరలించి అభివృద్ధిని అడ్డుకుందని విమర్శించారు.

గ్రామాల్లో జరిగిన ఎన్నికల్లో 70 శాతం సర్పంచ్ అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచారని తెలిపారు. హైదరాబాదులోని జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 26 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించిందన్నారు. పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ ప్రాంతాల్లో 80 శాతం స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు సన్నవడ్లకు బోనస్, రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి పథకాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో రూ.21 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, ప్రజల ఆశీస్సులతో మరింత అభివృద్ధి సాధిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బిరుదు రాధాకృష్ణ, వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్రావు, తహసీల్దార్ బషీరుద్దీన్, కాంగ్రెస్ నాయకులు వేగోళం అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్, మున్సిపల్ కౌన్సిలర్లు, మండలంలోని సర్పంచులు, పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నకిలీ సిగరేట్ల అమ్మకాలపై వేములవాడలో ఆకస్మిక దాడులు

## టాస్క్‌ఫోర్స్ సి.ఐ నటేష్.



**వేములవాడ, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

మంగళవారం రోజున నకిలీ సిగరేట్ల విక్రయాలపై జిల్లా గారి ఆదేశాల మేరకు వేములవాడ పట్టణంలో పలు కిరాణా,సూపర్ మార్కెట్,పాన్ షాప్ లలో ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు టాస్క్‌ఫోర్స్ సి.ఐ నటేష్ తెలిపారు. ఈసందర్భంగా సి.ఐ మాట్లాడుతూ,జిల్లాలో నకిలీ సిగరేట్ల విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు వేములవాడ పట్టణంలో పలు కిరాణా షాప్స్,సూపర్ మార్కెట్లు, పాన్ షాప్ లలో ఆకస్మిక దాడులు నిర్వహించడం జరిగిందని, ప్రముఖ బ్రాండ్ల పేర్లతో నకిలీ సిగరేట్లు విక్రయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, వ్యాపారులు చట్టాలను పాటించాలని సూచిస్తూ, నకిలీ సిగరేట్ల తయారీ లేదా విక్రయాలపై ఏవైనా సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. అక్రమ కార్యకలాపాల నిర్మూలనకు పోలీసులకు ప్రజల సహకారం అవసరమని ఇన్స్పెక్టర్ పేర్కొన్నారు. ఈ టాస్క్ లో టాస్కోర్స్ సిబ్బంది తిరుపతి, రాజేష్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.



# ప్రజా ప్రతినిధులకు సన్మానం

**రాయికల్, ఫిబ్రవరి 24 (ప్రజాజ్యోతి) :**

రాయికల్ మండలం లోని ఇటిక్యాల సర్పంచ్ నీరటి శ్రీనివాస్, రాయికల్ పురపాలక వైస్ చైర్ పర్సన్ తురగ సౌజన్య శ్రీధర్ ఎన్నిక కాగా మంగళవారం రాయికల్ 2005 ఇంటర్ బ్యాచ్ మిత్రులు పట్టణంలోని పద్మశాలి సంఘం భవనంలో ఘనంగా సన్మానించారు..ఈ కార్యక్రమం లో జక్క సురేష్, బొమ్మ దశ గౌడ్, నజీర్ ,ఉడుత సంతోష్, శ్రీనివాస్ రావు, ఆడెపు అర్జున్, మచ్చ రాజేంద్ర ప్రసాద్, నాయకులు పంచతీ రాజు తదితరులు ఉన్నారు.